# జలప్రళయంలో వింతజంతువు !

• "నేను చాల బలహీనుణ్ణి. భయంకరమైన దృశ్యాలనేవీ చూడ లేను. నన్ను ఇబ్బందిపెట్టకు బ్రదర్" అంటూ బ్రతిమాలాడాను. అతడు తన పట్టును వదలకుండా కొంత నిష్టురంగా అన్నాడు. "ఎంతో సహనం ఉన్న వాడివని అనుకొన్నాను. నువ్వే వందమార్లు వ్రాశావు. దేనికీ అధీ రులు కాకూడదని. పోనీ అలాంటి బీభత్సాలను నువ్వు చూడనవసరంలేదు. అవి దాదాపు కన్పించవుకూడా. అన్ని శవాలనూ పూర్తిగా కాకపోయినా కన్పించినవాటినల్లా వదలకుండా పూడ్చిపెట్టేశారు. తుమ్మల్లో రెమ్మల్లో ఎక్కడో ఉన్నవాటిని అన్వేషిస్తున్నారనుకో.... నువ్వా జంతువులు చూస్తే చాలు అన్నాడాయన.

నేను వెళ్ళక తప్పలేదు. దారి పొడుగునా అతడు చెబుతూఉంటే నేను వింటున్నాను. అతడు చూపిన దృశ్యాలన్నీ చూడలేక ఒక్కొక్క చోట అతిప్రయత్నంతో కళ్ళుమాత్రం మూసుకొని చెవుల్ని అప్పగిస్తూ వున్నాను.

"ఇక్కడే బ్రదర్. ఈ దిబ్బక్రిందనే ఐదారు శవాలను ఒకచే గొయ్యితీసి పూడ్చటం జరిగింది అదో ఆ మిట్ట వుంది. చూశావా అక్కడ పదేనుదాకా వుంటాయి పశువుల కళేబరాలు. వాటిని కూడా అక్కడే పాతే శారు" గుండె చెదరిపోతూవుంది అణువణువూ కంపిస్తూ వుంది.

''కాస్త ఆపవయ్యా'' అన్నాడు మిత్రుడు బాబూరావు. డ్రైవర్ జీపును ఆపేశాడు.

"ఇదే సామూహిక దహనం అంటూ నువ్వు దినపత్రికల్లో పడిన ఫొటో చూశావే ఈ మరు భూమియే అది. చూశావా ఆ బూడిదకుప్పలు"

జీపును పోనిమ్మన్నాను. కూలిపోయిన మహావృక్షాలు స్వాగతమిస్తున్నాయి. చొటి మట్టినే దుప్పటిగా కప్పుకొన్న పంటపొలాలు తల్లి తన పచ్చదనాన్ని కోల్పోయి దీర్ఘవ్యాధి సోకిన వృద్ధాంగనలా విలపిస్తోంది.

"ఈ తోటను చూశావా? అన్ని సపోటాచెట్లూ వేర్లు కుళ్ళి గంగపాలై పోయాయి ఇదేమిటి? అదో ఆ ఉత్తరాన మైదానంలో నిమ్మ, నారింజ నీటిపాలే. చూడు చూడూ.... అలా చూడు" అన్నాడు. బాబూరావు.

ఆ వైపున నాదృష్టి ప్రసరించింది. తలలు విరిగిన సైనిక శ్రేణిలో ఒక్కరైనా మిగలనట్లు నారికేళ వృక్షాల శిరాలు అదృశ్యమైనాయి ఏమిటీ వైపరీత్యం అన్పించింది. నాకు జ్యోతి రామలింగస్వామి జ్ఞప్తికి వచ్చారు. ఆ కరుణామూర్తి ఎండిపోతున్న పైరును చూచి అక్కడే చతికిలబడి బోరుమంటూ విలపించాడు. ఆ శోకంతో వాన కురిపించి. ఆ మహానుభావుడు బ్రతికి వుండీ ఈ దివిసీమలో అడుగుపెడితే ఏం జరిగేదో!

జీపు పెడుతూనే వుంది. మెల్లగానే పోతున్నది. భయంకర సమరానంతరం ప్రశాంతత నెలకొన్న కురుక్షేత్రం కూడా కాదిది. అంతకంటే ఘోరంగా వుంది.

"చూడు బ్రదర్.... ఈ పల్లెలో సగం జనాభా పోయింది. వుప్పెన ఎత్తుకు పోయింది. ఆ పోయిన వారిలో సగం మంది ముక్కు పచ్చలారని బిడ్డలు. మిగిలిన వారిలో ఎక్కువ మంది స్త్రీలు. హతశేషులకోసం ఆ పాకలు తాత్కాలికంగా వేస్తున్నారు" అంటూ పో లోపల పోదాం" అన్నాడు డ్రైవర్‌తో.

"వద్దు.... ఇంకో దారిలో పోదాం" అన్నాను. జీపు ఆగిపోయింది.

"ఎందుకూ?" అన్నాడు. బాబూరావు.

"నీకు తెలియదు బ్రదర్ నేను రాను. తృణమో, ఫణమో యివ్వ గలవారే ఆ వూళ్ళో అడుగుపెట్టడం మంచిది. కనీసం శ్రమదానం చేసే శక్తి ఐనా వుండాలికదా. ఆపదలో వున్న వారిని కలిసే పద్ధతి యిదికాదు" అన్నాను.

నీ మనస్సుకు నచ్చని పద్ధతి నాకూ అభిమతంకాదు. నేను వంద బిస్కెట్టు పొట్లాలు తెచ్చాను. ఆ మిగిలి ఉన్న పిల్లలకి నీ చేతులతోనే యివ్వు" అన్నాడు. బాబూరావు.

"నీ హృదయానికి నా కృతజ్ఞత బ్రదర్. కానీ అలాంటివాటిని పంచడానికి అర్హులు నాయకులుకానీనావంటి సామాన్యులు కారు. నువ్వే పంచాలది. అది నీ కష్టార్జితం. నీ మనస్సు బాధపడరాదు. ఇంత దూరం వచ్చాం కనుక వెడదాం పద. నేనా అనాథపిల్లల్ని చూచి వారి భవిష్యత్తు కోసం, మహోజ్వల భవిష్యత్తుకోసం భగవంతుని ధ్యానిస్తాను" అన్నాను.

బాబూరావు నాస్తికుడు. ఐనా మా ఆశయాలు ఏకీభవించని విషయ మంటూలేదు. నేను పుణ్యం అన్నదాన్ని అతడు మంచి అంటాడు. అతడు చెడ్డ అన్నదాన్ని నేను పాపం అంటాను. పదాల మార్పు తప్ప మా ఇద్దరి భావాలూ ఒక్కటే.

ఊళ్ళోకి జీపు వెళ్ళగానే దానిచుట్టూ మూగినవారి వదనాలను చూచాను. ఎవరో వచ్చారని వారు అనుకుని వుంటారు. బాబూరావు ఆ బిస్కెట్ పొట్లాలను చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా తలా ఒక్కటి చ్చాడు. అక్కడ పాకలో ఉన్న పెద్ద మనిషిని పలుకరించాడు. కొత్త

పాకలను నిర్మిస్తున్న యువకులతో ముచ్చటిస్తూ కరచాలనం చేస్తూ నావంక చూచి యిట్లా అన్నాడు.

"ఈ విద్యార్థులంతా కళాశాలల్ని వదలి యిక్కడ వారంరోజుల నుండి వున్నారు. వస్తూ వస్తూ లారీవిండుగా బట్టలు ఆహార సామగ్రి పాత్రలు కూడా పట్టుకవచ్చారు. ఇట్లా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఈ చరిత్రాత్మకమైన పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. తెలుగుతల్లి ప్రసవించిన కరుణాస్వరూపులు."

ప్రతి యువకునిలోనూ ఏదో ప్రగాఢమైన పట్టుదల కన్పించింది. వారి దర్శన మాత్రంతోనే నా జన్మ తరించిందనుకొన్నా. వారు నాకు వివేకానందులుగా అపరబుద్ధులుగా అరవిందులుగా, రమణులుగా, ధ్రువులుగా మార్కండేయులుగా కనిపించారు, కరుణారస ప్రవాహంలో ఈదులాడుతున్న భావన తోచింది నాకు.

వారివద్ద సెలవు తీసుకొన్నాం. బాబూరావు జీపులో కూచుని "ఇంకా" ఎందరో ఉన్నారు బ్రదర్. వారంరోజులు నీటిలో కుళ్ళిన శవాల దుర్గంధాన్ని భరిస్తూ అనాథ ప్రేతాలను ఖననం చేసిన మహాత్యాగులు మనదేశానికి నిజమైన వారసులు" అన్నాడు.

జీపు ఆ శిథిల గ్రామం పొలిమేరలను దాటుకొన్నది.

"ఇదీ బ్రదర్ మహావిషాదం. ఇక్కడే ఆ నరసయ్య పొలం. పొలంలోనే గుడిసె. పాలేరు కుటుంబం, పశువుల కొట్టం.... అంతా ఊడ్చేపింది ఉప్పెన ఆ చోటును చూదామా?"

అప్పటికే నాతల తిరిగిపోతూ ఉంది కళ్ళలో చెమ్మ. ఎందుకో నాలుక తడి ఆరిపోతూంది

"వద్దులే బ్రదర్ ... నేను ముందే చెప్పాను గదా! నా కళ్ళలో నీళ్ళులేవు కార్చడానికైనా.... ఇది నిజం. యుద్ధరంగంలో ఐతే ప్రాణాలనైనా యివ్వవచ్చు. తప్పులేదు. ఆశ్చర్యముకాదు. ఇక్కడ అవసరమైంది. అదికాదు. పిడికెడు ఉప్పు, దోసెడు పప్పు.... పడి బియ్యమైనా ఈ సీమకు చేర్చాలి జానెడు మూరెడో బట్టనైనా అందివ్వాలి. పది తాటాకు మట్టలనైనా సేకరించి యివ్వగలగాలి. అదీ అవసరం. శ్రమదానం చేసేవారికి తప్ప మిగిలిన వారికిక్కడ పనిలేదు. తెలివినీ శక్తినీ పలుకుబడినీ ఉపయోగించి పదిరూకలు సంపాదించి యిక్కడికి పంపాలి. చూచేదేముంది" అన్నాను.

"సరే .... అసలు చూడవలసిన వింత జంతువును" అన్నారాయన.

అప్పుడు జ్ఞప్తికి వచ్చింది. ప్రళయంలో వింత జంతువును చూపడానికి నన్ను బాబూరావు పిలుచుక వచ్చిన విషయం.

మనిషికి ఎంత శోకంలోనైనా ఏదో విచిత్రం అంటే చూడాలనిపిస్తుంది. ఎన్నో సర్కసుల్లో జంతు ప్రదర్శన శాలల్లో విచిత్ర జంతువుల్ని చూశాను కాని, బాబూరావు నిర్వచించిన విచిత్ర జంతువును మాత్రం చూడలేదు. అతడు చెప్పిందిది.

"జంతువు వింత జంతువు.
అది మాట్లాడుతుంది.
అది నడుస్తుంది,
దానికి రెండు కండ్లున్నాయి.
రెండు చెవులు కూడాఉన్నాయి.
ముక్కూ ఉంది. నాలుకా ఉంది"

లేనిదేది? అనే అనుమానం వచ్చి దారిలో అడిగాను. చెబుతాను అంటూ "దానిని కనిపెట్ట గలవనే నిన్ను రమ్మన్నాను" అన్నాడు.

హైదరాబాదులో మదరాసులో ఇంకా కొన్ని రాజధాని నగరాలలో జంతుప్రదర్శన శాలలకు ఈ వింత జంతువును పంపవచ్చుగదా! జలప్రళయంలో లభించిన ఈ వింతజంతువును ప్రభుత్వ స్వాధీనం చేయాలిగదా! ఇవన్నీ నాలో అనుమాన పరంపరలు.

"ఇప్పుడెక్కడ ఉంచారా జంతువును" ప్రశ్నించాను.

"చూస్తావుగా ... అదోఊరు....ఊరు ఆ ఊళ్ళోనే" అన్నాడాయన

నాలో ఆతురత యెక్కువైంది. ఆ ఊళ్లోకి జీపు వెళ్ళకముందే ఊరిబయటే ఆపేయమన్నాడు.

"నువ్వు జీపు దగ్గరే ఉండు. పదినిమిషాల్లో వస్తా" మన్నాడు. బాబూరావు డ్రైవరుతో..

ఇద్దరం ఊళ్ళోకి వెళ్ళాము! ఒకటీ రెండు వీధులు దాటుకొన్నాము. మూడో వీధిలో మూడో గడప ముందు క్షణం ఆగి ఆ వసారాలో కూచున్న వ్యక్తి వైపు వేలెత్తి స్పష్టంగా చూశాడు.

ఆ వ్యక్తి మమ్మల్ని చూచి తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

"ఇక పోదాంరా బ్రదర్" అన్నాడు బాబూరావు. నాకు ఏదీ అర్థంకాక అతణ్ణి అనుసరించాను.

"ఏమీ ఆశ్చర్యపడకు. తన తెలివిని ఉపయోగించి ఆరు ఫోర్జరీ సంతకాలతో తొమ్మిది వందలు కొట్టేశాడు బాధితుల పేరుతో. బస్తా కందిపప్పు కొత్త పాతలుకూడా... బియ్యం మామూలనుకో. ఆరు కుటుంబాల కోటా" అన్నాడు బాబూరావు.

"రిపోర్టు చెయ్యలేదా?" ప్రశ్నించాను.

"చేశారనుకో ఏం జరుగుతుంది? సస్పెండు చేశారు అంతేగా" అన్నాడు నిర్లిప్తంగా.

నాకప్పటికి అవగతమైంది. మామూలు లంచం పట్టేవారు జంతువు లైతే కావచ్చు. జలప్రళయంలో ఈ ఘోరానికి దిగజారిన వారిని వింత జంతువులనాలి. ఇది బాబూరావు అభిప్రాయమై వుంటుంది అనుకొన్నాను.

"ఈ వింత జంతువును చూడటానికికా ఇంత దూరం వచ్చాము" అన్నాను నైరాశ్యంతో.

"నీవు చూడాలి. అప్పుడే ఇట్టి వింత జంతువులకు మన సాహిత్యంలో ప్రత్యేక స్థానం లభిస్తుంది. వీరు బకాసుర సంతతి కూడా కాదు. వాడొక క్రమాన్ని అనుసరించి ఊళ్లో మనుషుల్ని తిన్నాడు. వీరు ఉప్పెనలో ఊడ్చుక పోగా ప్రాణాలతో బయటపడ్డ వారి గుండెల్ని తిరిగి తిరిగీ నంజుకుంటున్నారు" అన్నాడు పిడుగుపడ్డట్టు.

"ఏం చేద్దాం.... ఖర్మ...." అన్నాను.

"అదేగా మనిద్దరికీ పడని వ్యవహారం. అంతా దేవుడు చూస్తా డంటావు. అంతేనా!" అన్నాడు. మరీ హెచ్చు స్వరంతో.... "ఇంకేం చేయగలం?" అన్నాను. బాబూరావు పిడికిలి బిగించి పళ్ళు కొరుకుతూ నావంక చూచి గట్టిగా అన్నాడు. "నాకొక విమానం వుంటే ఇలాంటి వెధవల్నంతా ఎత్తివేసుకొని సహారా యెడారిలో విసరి విసరీ పారేసి వచ్చే వాణ్ణి వీళ్ళు మనుషులా....?"

అతడెన్నో అన్నాడు. ఆ మాటల్ని అక్షరబద్ధం చెయ్యడానికి ఈ కలం అంగీకరించదు. మా గమ్యం చేరేవరకూ అతడు అంటూనే వచ్చాడు. నాజన్మలో వినని బూతుల్ని పచ్చి బూతుల్నే ఉపయోగించాడు.

అంతా వింటూనే వచ్చాను. విధిలేదు. మానవుడా సీమలో దేవుడై సాక్షాత్కరించడం నా కళ్ళతోనే చూశాను. అదే మానవుడక్కడ దానవుడై విజృంభించడం కూడా చూశాను.

జీపు ఆగిందే దిగాము.

బాబూరావుకు చెమట పోసిందని తెలుసుకొన్నాను. నెమ్మదిగా కూచున్నాము.

"మరీ కోపంవస్తే మాత్రం ప్రయోజనం వుందా? ఓపిక పట్టాలి గాని" అన్నాను.

బాబూరావు ప్రశ్నార్థకంగా చూశాడు

"నువ్వు నిన్న మొన్న చూశావు. నేను పాతికేళ్ళకు ముందే చూశాను" అన్నాను.

"ఎక్కడ వచ్చిందిపుడు ప్రళయం?" అన్నాడాయన.

"ప్రళయం కాదనుకో.... మా రాయలసీమలో కాటకం వచ్చింది. గొడ్డూగోదా చచ్చి జనాలూ చస్తుంటే గంజికోసం బియ్యం పెసరపప్పు ఉల్లిపాయలు ఊరూరా పంచితే అక్కడక్కడా యిలాగే కాజేశారు." అన్నాను.

తెగెయ్య లేక పోయారా?" అన్నాడు రౌద్రంగా పైకిలేచి ....

"లేదుబ్రదర్ ... లేదు. నువ్వు అప్పుడు గమనించలేదు. నీ వంటి వాళ్ళు చూడాలనే వారి నలాగే కరువులో వికృత పశువులని నామకరణం చేసిఉంచాము. ఆ సంతతి వారే వీరు. నువ్వు వీరికి ప్రళయంలో వింత జంతువులని పేరుంచి నాకు చూపావు. నేనెరగనా? వీళ్ళ అబ్బల్నే చూశాను కరువులో." అన్నాను.

బాబూరావు సర్దుకొని కాఫీ తెమ్మన్నాడు. కాఫీ త్రాగుతూ ఉంటే మళ్ళీ ఆరంభించాడు భట్టివిక్రమార్కునికథ కంటిన్యూ చేస్తున్నట్లు, నా పరిజ్ఞానాన్ని ప్రశ్నిస్తున్నట్లు.

"ఈ వింత జంతువులకు లేనిదేదో చెప్పలేదే నువ్వు?" ఇదీ ప్రశ్న.

నేనూ బడిపంతులుగా పదేనేళ్ళు పనిచేశాను గదా! "హృదయం బ్రదర్.... హృదయం...." అన్నాను.

అతడేమీ మాట్లాడలేదు.